# సర్వీస్ రోడ్డే పార్కింగ్ ప్లేస్

- రోడ్డుకు ఇరువైపులా లారీల నిలిపివేత
- మధ్యలో పశువుల సంచారం
- వాహనచోదకులకు తప్పని అవస్థలు



ఐవోసీ సర్వీస్ రోడ్డులో ఇరువైపుల లారీ పార్కింగ్.. మధ్యలో పశువుల సంచారం

**మల్కాపురం:** సర్వీస్ రోడ్డును పార్కింగ్ ప్లేస్‌గా మార్చేశారు. దీంతో విశాలమైన మార్గం ఉన్నా కుంచించుకుపోయింది. 60 అడుగుల రోడ్డులో రాకపోకలకు కనీసం 10 అడుగులు కూడా మిగలక అవస్థలు పడాల్సిన పరిస్థితి వచ్చింది.

మల్కాపురం సమీపంలోని ఐవోసీ టెర్మినల్ ప్లాంట్‌కు వెళ్లే మార్గం 60 అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇక్కడి టెర్మినల్ ప్లాంట్‌కు, స్థానిక చింతామణి గణపతి ఆలయానికి, బీపీసీ టెర్మినల్ ప్లాంట్‌కు వెళ్లేవారికి అనువుగా విశాలమైన మార్గం నిర్మించారు. అయితే ఈ మార్గంలో ప్రస్తుతం ఐవోసీ ప్లాంట్‌కు ఆయిల్ లోడ్ కోసం ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న లారీలను రోజుల తరబడి నిలిపివేస్తున్నారు. ఇలా రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్‌తో 60 అడుగుల రోడ్డు 10 అడుగులుగా మారింది. దీంతో దేవాలయానికి వచ్చే భక్తులు, హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులకోసం వచ్చే కార్మికులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

ఇదిలా ఉంటే.. పలువురు పశువుల కాపరులు తమ పశువులను ఈ మార్గంలో నిర్లక్ష్యంగా విడిచి పెట్టడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. అసలే ఇరుకు మార్గంలో ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు, పాదచారులకు పశువుల సంచారం కొత్త తలనొప్పిని తెచ్చి పెడుతోంది.

**పార్కింగ్‌కు స్థలం ఉన్నా..**

వాస్తవానికి ఐవోసీ సంస్థ తమ ప్లాంట్ వచ్చే వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించింది. అయితే లారీల డ్రైవర్లు మాత్రం నిర్దేశించిన ప్రాంతంలో నిలపకుండా ఇష్టారాజ్యంగా రోడ్డును ఆక్రమించేస్తున్నారు. అధికారులు స్పందించి రాంగ్ పార్కింగ్‌పై చర్యలు తీసుకుని, మార్గం సుగమం చేయాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

### చాలా ఇబ్బంది పడుతున్నాం



ఐవోసీ మార్గంలో ఎప్పుడూ లారీలు ఉంటున్నాయి. పశువులు నిత్యం తిరగడంతో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంది. పక్కనుంచి వెళ్లాలంటే లారీలు.. ఇలా ఎన్నాళ్లు? అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వినయ్ చట్టి, పాదచారుడు

### వాహనాలకు మార్గం లేదు



ఐవోసీ రోడ్డులో ప్రయాణమంటే భయమేస్తోంది. రెండువైపులా లారీలు ఉంటాయి. పశువులు బైక్‌కు అడ్డుగా వచ్చేస్తున్నాయి. తప్పుకొందామంటే మార్గం ఉండటం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్నట్లు ఉంటోంది.

– చైతన్య, ద్విచక్ర వాహనచోదకుడు

### చర్యలు తీసుకుంటాం

ఐవోసీ మార్గంలో లారీలు నిలిపివేత మా దృష్టికి వచ్చింది. గతంలో వీరికి హెచ్చరికలు చేశాం. మరి కొంతమందికి జరిమానాలు విధించాం. మరింత కఠినంగా వ్యవహరిస్తాం. లారీలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం.

–సుదర్శన్‌రావు, ట్రాఫిక్ ఎస్ఐ, మల్కాపురం

## అంగన్‌వాడీ కేంద్రాలు మరింత బలోపేతం

**సీడీఎంఏ కోటేశ్వరరావు**



కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న సీడీఎంఏ కోటేశ్వరరావు

**విశాఖ విద్య:** అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీఎంఏ పి.కోటేశ్వరరావు అన్నారు. బుధవారం విశాఖ నగర పర్యటనకు వచ్చిన ఆయన 52వ వార్డు పరిధిలోని అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఎంతమంది ఉన్నారనేది కేంద్రం కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నుంచి పౌష్టికాహారం ఎలా అందుతుందని గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. మాతా–శిశు సంరక్షణ కోసమని అందిస్తున్న పౌష్టికాహారంపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో జోన్–5 మున్సిపల్ కమిషనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్

**సింహాచలం:** ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. పినగాడి వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని డ్రైవ్ చేయొద్దని సూచించారు. ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్, సీఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## విజ్ఞాన నేస్తాలు పుస్తకాలు



డాక్టర్ పద్మశ్రీని సత్కరిస్తున్న అధ్యాపకులు

**మల్కాపురం:** మంచి పుస్తకం మంచి మిత్రుడు లాంటిది.. మంచి మిత్రుడికి దూరం అయితే ఎంత బాధపడతామో.. మంచి పుస్తకాన్ని చదవక పోయినా అంతే బాధపడాల్సి వస్తుందని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ గ్రంథాలయ మేనేజర్ డాక్టర్ పద్మశ్రీ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో బుధవారం విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞాన నేస్తాలన్నారు. వీటిని చదవడం వల్ల ప్రపంచంపై అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. మంచి పుస్తకాలు మంచి ఆలోచనలను రేకెత్తిస్తాయన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు పద్మశ్రీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, కళాశాల గ్రంథాలయాధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**సబ్బవరం:** సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్,ఎకనామిక్స్ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు.అదేవిధంగా నెట్/స్లెట్ కలిగి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలియజేశారు. అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో డెమో తరగతులు నిర్వహించడానికి ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు.

## ముగిసిన శ్రామిక్ కాంగ్రెస్ సర్వసభ్య సమావేశాలు



మాట్లాడుతున్న జనరల్ సెక్రటరీ సాహు

**తాటిచెట్లపాలెం:** తాటిచెట్లపాలెంలోని ఆశీర్వాద్ కల్యాణ మండపంలో మంగళవారం ప్రారంభమైన ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ద్వి వార్షిక సర్వసభ్య సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పలు తీర్మానాలు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో 8 వేల నుంచి 9 వేల మంది ఉద్యోగుల కొరత ఉందని, వెంటనే వీటిని భర్తీ చేయాలన్నారు. రైల్వే జోన్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న సిబ్బంది క్వార్టర్స్‌ను వెంటనే తొలగించి కొత్తవి నిర్మించాలని తీర్మానించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రైల్వే మెన్స్ సహకారంతో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నిరంతరం ఉద్యోగుల సంక్షేమం, అభ్యున్నతి కోసం పోరాడుతోందని తెలిపారు. అనంతరం రాబోయే రెండేళ్లకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె.సంపత్‌కుమార్, డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి.మాహేశ్వరరావు, శ్రామిక్ కాంగ్రెస్ పరిధిలోని ఆయా బ్రాంచ్‌ల కేంద్ర కార్యవర్గ సభ్యులు, కార్యదర్శులు, ప్రతినిధులు, జనరల్ కౌన్సెల్ సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శ్రీనివాస్ వర్మ సేవలు ఎనలేనివి



వర్మను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

**విశాఖ విద్య:** నగర పాలక సంస్థ తాగునీటి సరఫరా విభాగం డిప్యూటీ ఈఈగా యు.శ్రీనివాసవర్మ అందించిన సేవలు ఎనలేనివని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వర్మ బుధవారం శ్రీధర్‌ను క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ ఆయన్ను సత్కరించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాటర్ సప్లై విభాగం ఉద్యోగులు సన్యాసప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### 300 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**గోపాలపట్నం:** స్థానిక 30 పడకల ఆస్పత్రిలో ఆయుష్మాన్ భవ కిందట బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వారం వారం ఆరోగ్య మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, పిల్లల వైద్య నిపుణులు, మానసిక వైద్యనిపుణుడు, గైనిక్ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

### ఘనంగా పవిత్ర విసర్జన

**సింహాచలం:** సింహాగిరిపై నిర్వహిస్తున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం రాత్రి మహా పూర్ణాహుతిని ఘనంగా నిర్వహించారు. అలాగే పవిత్ర విసర్జనను వైభవంగా చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, పురోహిత అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాలను నిర్వహించారు.

### టీడీపీ నాయకుల నిరసన

**మల్కాపురం:** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ 61వ వార్డు మల్కాపురం వద్ద బుధవారం టీడీపీ నాయకులు నల్ల వస్త్రాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ చంద్రబాబుది అక్రమ అరెస్టు అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే ధ్యేయంగా..



58వ వార్డు ములగాడ విలేజ్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**మల్కాపురం:** ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేశారు.దీనిలో భాగంగా రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. దీనిలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్లి ఆ ఇంట్లో ఉన్న వారి ఆరోగ్యం ఎలా ఉంది.. వారికి బీపీ,సుగర్,రక్తహీనత వంటి సమస్యలు ఉన్నాయా అన్న దానిపై ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు వైద్య పరీక్షలు చేస్తున్నారు.బుధవారం ఉదయం నుంచి ఆ ప్రాంత ఏఎన్ఎంలు ములగాడ విలేజ్, ఎదురువానిపాలెం, చిన్న ములగాడ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అలాగే 59వ వార్డు నక్కవానిపాలెం,పాతచెక్‌పోస్టు ఏరియా ప్రాంతాల్లో ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి అక్కడ నివాసులందరికీ వైద్య పరీక్షలు చేశారు.

## ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు

**శాంతినగర్‌లో భారీ అన్నదానం**



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్ తదితరులు



అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న కలిదిండి బద్రీనాథ్

**విశాఖ విద్య:** గణపతి నవరాత్రి ఉత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో లంబోదరుడి చెంత ప్రతీ రోజూ దీపారాధనలు, హోమాలు, కుంకుమ పూజలు చేస్తున్నారు. మరో పక్క మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పార్వతీ తనయుడి విందు భోజనం ఆరగించేందుకు భక్త జనం ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. 52వ వార్డు శాంతినగర్‌లో జియ్యాని విజయ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపం వద్ద బుధవారం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. పరిసర కాలనీల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, 90వ వార్డు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నమ్మి శ్రీను, జియ్యాని విజయ్ భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు.

**62, 63 వార్డుల్లో...**

**సింధియా:** జీవీఎంసీ 62వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో బుధవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటరు బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూఅన్నసమారాధన నిర్వహించడం గొప్పవిషయమన్నారు.

- జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవలో గణనాథ అండ్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాధుల సురేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**విశేష పూజలు**

**మల్కాపురం:** మల్కాపురం గొల్లవీధి వద్ద యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ,ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ పాల్గొన్నారు. గాంధీజీవీధిలో గాంధీజీ వీధి యంగ్ బాయిస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ లక్ష్మణరావు

## కృత్రిమ కొలనులో గణపతి నిమజ్జనం



వరసిద్ధి వినాయక విగ్రహాన్ని కొలనులో నిమజ్జనం చేస్తున్న చిన్నారులు

**కంచరపాలెం:** స్థానిక గొల్లకంచరపాలెంలో రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. అందరినీ ఆకట్టుకునేలా చిన్నారులు తయారు చేసిన కృత్రిమ కొలనులో గణపతి ప్రతిమను నిమజ్జనం చేశారు. ముందుగా వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, సర్వసిద్ధి సాయిలత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కామిశెట్టి మనోహర్, నమ్మి జశ్వంత్, మాన్విత, దుర్గాప్రసాద్, సిహెచ్.జశ్వంత్, కె.భానుతేజ, కుప్పా ఆశిశ్, రూపేశ్, కె.సురేష్, శ్రావ్య, నిఖిల, పిన్నింటి భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కంఠభరితంగా టెన్నికాయిట్ పోటీలు

- 300 మంది క్రీడాకారుల హాజరు
- అండర్ 14, 17 విభాగాల్లో ఎంపికలు



తలపడుతున్న క్రీడాకారులు



టెన్నికాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పీఎస్‌రాజు

**పరవాడ/అగనంపూడి:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు, ఎంపికలు పరవాడ మండలం పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం చేపట్టారు. ఈ పోటీల్లో 15 నియోజకవర్గాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 17 (బాలురు, బాలికలు) విభాగాల్లో పోటీలు నిర్వహించి ఎంపికలు చేపట్టారు. పోటీలను ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు (పీఎస్‌రాజు) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. అందుకు తగ్గట్టుగా క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. రాష్ట్ర జట్టులో తలపడనున్న జట్లను కూడా ఎంపిక చేశారు. వీరికి క్రీడా దుస్తులకు గ్రామ సర్పంచ్ నాగమణి, ఆమె కుమారుడు కబడ్డీ అప్పారావు రూ.10 వేల నగదు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు దివాకర్, గొంతిన సాయి శైలజ, పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణ, గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, కబడ్డీ అప్పారావు, అనకాపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, పాఠశాల పీడీ ఎస్.వి.రమణ, వైఎస్ ఎంపీపీ బూస అప్పలరాజు, పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు తదితరులు పాల్గొన్నారు.

**బహుమతుల అందజేత**

క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ రవిబాబు పాల్గొని బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ పెద్దినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కె.ఎం.నాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ దాలిబోయిన పైడిరాజు, సభ్యులు కె.సత్యనారాయణ, వై.బుజ్జి పాల్గొన్నారు.

## సీఎం జగన్ నిర్ణయం చరిత్రాత్మకం

**కులాల ప్రాతిపదికన జనగణన ప్రకటనపై నాయకుల హర్షం**



మాట్లాడుతున్న రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత

**తాటిచెట్లపాలెం:** కులాల ప్రాతిపదికన జనగణన చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మకమని రాష్ట్ర యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత అన్నారు. నరసింహనగర్‌లోని ఆమె కార్యాలయంలో బుధవారం నగరంలోని పలు నియోజకవర్గాల యాత ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ కుల ప్రాతిపదికన జనగణన జరగాలని స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అనేక ప్రజా సంఘాలు పోరాటాలు చేస్తున్నా.. ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ముందుంటుందని తెలిపేందుకు ఈ నిర్ణయమే సాక్ష్యమని పేర్కొన్నారు. కులగణన జరిగినప్పుడు రిజర్వేషన్ల అమలు తీరు ఏ మేరకు ఉందన్న విషయం, విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలపై కూడా స్పష్టత వస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు మాట్లాడుతూ సమాజంలో రాజకీయ, ఆర్థిక, విద్య వంటి సదుపాయాలు పొందని అణగారిన వర్గాలకు కులగణన ద్వారా నూటికి నూరు శాతం ప్రయోజనం చేకూరుతుందన్నారు. సమావేశంలో ఆయా ప్రాంతాల యాత నాయకులు బసరమాని లక్ష్మణరావు, గొడ్డి కన్నారావు, బసరమాని ఈశ్వరరావు, సంపంగి మంగరాజు, వడిశెల సూరిబాబు, సిమ్మా గోవిందరావు, వనుం లోకేష్, పిల్లి సంతోష్‌కృష్ణ, పిల్లి కన్నారావు, పిల్లి రాజా రాఘవేంద్ర, లొట్ల వరహాలు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీపై అవగాహన అవసరం



సర్టిఫికెట్లు అందజేస్తున్న కోటేశ్వరి

**మహారాణిపేట:** మద్రిపాలెం జాతీయ రహదారి వద్ద ఉన్న శారదావేలీ డెవలప్‌మెంట్ సమితి (ఎస్‌వీడీఎస్)ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ విభాగం అడిషనల్ డైరెక్టర్ చిన్నయీదాస్, అడిషనల్ పీడీ కోటేశ్వరి సందర్శించారు. ఇక్కడున్న ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా టైలరింగ్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కోటేశ్వరి సర్టిఫికెట్లు అందజేశారు.

## సేవాకార్యక్రమాలతో సంతృప్తి



చిన్నారావును సత్కరిస్తున్న జై భీమ్ మిషన్ సభ్యులు

**సింధియా:** చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ జాతీయ వ్యవస్థాపకుడు దోమాన చిన్నారావును బుధవారం ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ జై భీమ్ మిషన్ జిల్లా అధ్యక్షుడు దొడ్డి నిరీక్షణ రాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిరీక్షణ రాజు మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ చిన్నారావు ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. అనంతరం దోమాన చిన్నారావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులను, పెద్దలను గౌరవిస్తూ సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో సిరింగుల వెంకటరత్నం, గొల్ల ఆశీర్వాదం, లాలూరి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.